ప్రజాశక్తి
మంగళవారం 10 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

అప్పుల బాధ తాళలేక..

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య చేసుకున్న ఘటన త్రిపురాంతకం మండలంలోని గట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలంలోని గుట్ల ఉమ్మడివరం, గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్లపల్లికి చెందిన తెళ్లమేకల ఆదిశేషయ్య(55)కు తొమ్మిది ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో కొన్ని సంవత్సరాలుగా మిర్చి, పత్తి, వరి పంటలు సాగు చేశాడు. ప్రకతి వైపరీత్యాల కారణంగా వేసిన పంటలో తెగుళ్లు రావడంతో, దిగుబడి రాక అప్పులపాలయ్యాడు. మొత్తం రూ.15 లక్షల అప్పులున్నాయి. అప్పులబాధ తాళలేక మనస్తాపం చెంది ఊరి సమీపంలోని మిరప కల్లాలలో ఆదివారం రాత్రి చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు ఆదిశేషయ్య మృతదేహాన్ని చూసి.. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

మెప్మా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

మెప్మా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం మెప్మా కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు సబర్బన్

ఎత్తులు..పొత్తులు..

- చంద్రబాబు, పవన్ భేటీపై 'తెలుగుదేశం'లో ఉత్సాహం
- 2014 ఎన్నికలలో పరిస్థితి పునరావృతమవుతుందన్న చర్చ
- ఆ రెండు పార్టీల వ్యూహాలపై వైసిపిలో తర్జనభర్జన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాజకీయ పరిణామాల్లో వేగంగా మార్పులు కనిపిస్తున్నాయి. కొత్త కలయికలతో పార్టీల్లో రాజకీయ సమీకరణల్లోనూ మార్పుల దిశగా అడుగులుంటాయనే విశ్లేషణలు జోరందుకున్నాయి. మరో వైపు రాష్ట్రంలో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కుతోంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభు త్వం సభలు, ర్యాలీలను నిషేధిస్తూ జీవో తీసుకురావడం కూడా ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది. దీనిపై పోరుబాటకు అన్నిపార్టీలూ సన్నద్ధమవుతున్నాయి. తాజాగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ల భేటీ చర్చకు తావిస్తోంది.

చంద్రబాబు, పవన్ భేటీపై రెండు రోజులుగా రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జీవో నెం.1పై పోరాటం చేయాలని ఇద్దరూ నిర్ణయించారు. అయితే రాజకీయంగా సాగే చర్చ మాత్రం అంతా ఎన్నికల కోణంలోనే కనిపిస్తోంది. కలిసి పనిచేయాలనే ఎజెండా ఎక్కడ దాకా నడుస్తుంది? ఇద్దరూ కలిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు వ్యూహం నడిచిందా? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పుడు ఇద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుందనే చర్చ సాగుతోంది. ఈ రెండు పార్టీల అధినేతల కలయికపై మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా స్పందించారు. ఇందులో కొత్తేమీలేదంటూ రాజకీయ కోణంలోనే ఆయన ఆరోపణలు చేశారు. నిజంగా జీవోపైనే చర్చించేందుకు భేటీ జరిగితే దీన్ని రద్దు చేసేవరకూ పోరాడుతారా? అనేదీ చూడాలి. ఇక రాజకీయ కోణంలోనూ పెద్ద చర్చ సాగుతోంది. ప్రధానంగా ఈ రెండు పార్టీల కలయికపై తెలుగుదేశం శ్రేణుల్లోనే ఉత్సాహం కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎలా పోటీలు ఉంటే గెలుపు,ఓటములు ఎలా ఉంటాయనే దానిపై ఇటీవల సాగుతున్న చర్చలకు ఈ భేటీ కీలకంగా మారింది. వైసిపి ప్రస్తుతం బలంగా ఉంది. గడపగడపకూ ప్రభుత్వం పేరుతో వైసిపి మంత్రులు మొదలు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు అందరూ ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి ఎన్నికలు వస్తాయన్నది అంచనా. అప్పటికే ఒక పర్యాయం ఇళ్లకు వెళ్లడం కలిసొచ్చే అంశంగా వైసిపి భావిస్తోంది. అయితే బహిరంగ చర్చల సారాంశం చూస్తే తెలుగుదేశం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒంటరిగా పోటీ చేస్తే వైసిపిని ఢీ కొట్టలేదనేదీ ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా నడిచింది. అదే జోరు కొనసాగుతుందనే చర్చ ఉంది. ఉద్యోగులు, పోలీసు వర్గాల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోంది. మధ్యతరగతి వర్గాల్లోనూ పెదవి విరుపు ఉంది. దిగువ స్థాయిలో మాత్రం వైసిపికి బలం ఉంది. ఈ మార్పుల పైనా పార్టీల్లో ఎవరి అంచనాల్లో వాళ్లున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాల్లో పవన్‌కళ్యాణ్‌తో కలిసి పోటీ చేయాలనే ఉత్సుకత పెరుగుతోంది. ఇద్దరూ కలవడంపైనే సామాజికమాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చలు మొదలయ్యాయి. సోషల్‌మీడియాలో తెలుగుదేశం శ్రేణుల్లో ఉత్సాహం బాగా పెరిగినట్లు పోస్టుల సారాంశం విదితమవుతోంది. ఇద్దరూ కలిస్తే ఇక జగన్ పని అయిపోయినట్లేనని ప్రచారాలు ▶ 2లో

న్యాయం కోసం రాస్తారోకో

- మహిళ మృతికి ప్రియుడే కారణమంటున్న బంధువులు
- హత్య కేసు నమోదు చేయాలని ఆందోళన

రాస్తారోకో చేస్తున్న శ్రావ్య బంధువులు, ఇన్‌సెట్లో శ్రావ్య (ఫైల్)

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రియుడే మహిళకు బలవంతంగా పురుగుమందు తాపించి.. హత్య చేశాడని.. నిందితుడిని అరెస్టు చేసి.. కఠినంగా శిక్షించాలని భట్టిప్రోలులోని అద్దేపల్లి వద్ద జాతీయరహదారిపై మృతురాలి బంధువులు సోమవారం రాస్తారోకో చేశారు. న్యాయం చేయాలని మూడు గంటల పాటు బైఠాయించారు. న్యాయం జరిగేలా చూస్తామని సిఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గ్రామస్తుల కథనం ప్రకారం.. భట్టిప్రోలులోని అద్దేపల్లి గ్రామానికి చెందిన కనపర్తి శ్రావ్య(30)కు కొన్నేళ్లక్రితం వివాహమైంది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమెకు భర్తతో విభేదాలు తలెత్తటంతో కొన్నాళ్ల క్రితం విడిపోయారు. కొన్ని రోజుల తర్వాత ఆమెకు అదే గ్రామానికి చెందిన కిరేషితో పరిచయం ఏర్పడింది. మంచీచెడులన్నీ చూసుకుంటానని.. వివాహం కూడా చేసుకుని ఆమె పిల్లలను కూడా తన పిల్లలుగా చూసుకుంటానని కిరేషి నమ్మబలికాడు. ఈ క్రమంలో కిరేషి మరో మహిళను వివాహం చేసుకొని ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో శ్రావ్య అతనితో గొడవ పడింది. పోలీస్ కేసు పెట్టడంతో పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకొని.. ఇద్ద రినీ చూసుకుంటానని కిరేషి హామీ ఇచ్చారు. శ్రావ్యతో విజయవాడలో వేరు కాపురం పెట్టాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం విజయవాడలో శ్రావ్య వద్దకు కిరేష్ వచ్చాడు. తనకు అడ్డుగా ఉందని భావించి.. ఆమెతో బలవంతంగా పురుగుల మందు తాపించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ శ్రావ్య సోమవారం మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని అద్దేపల్లికి తీసుకొచ్చి.. కిరేష్ ఇంటి వద్దనే ఉంచి మృతురాలి కుటుంబానికి పిల్లలకు న్యాయం చేయాలని సుమారు రెండు వందల మందికి పైగా 216 జాతీయ రహ దారిపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో చేయడంలో వాహనాల రాకపోకలు భారీగా నిలిచిపోయాయి. మృతురాలి వద్ద రూ.ఆరు లక్షలకు పైగా నగదు, బంగారం కూడా నిందితుడు అపహరించాడని, హత్య చేసిన కిరేష్‌పై కేసు నమోదు చేసి.. పిల్లలను కూడా న్యాయం చెయ్యాలని బంధువులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోనే కేసు నమోదు చెయ్యాలని పట్టుబట్టారు. సిఐ వెంకటేశ్వరరావు గ్రామస్తులకు నచ్చజెప్పి న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీ ఇవ్వటంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

కలెక్టర్ విజయకృష్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేసే శకటాలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు గ్రౌండ్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గడువులోగా అర్జీలను పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వారంలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యపై పదేపదే అర్జీలు వస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. మండల ప్రత్యేకాధికారులు పారిశుధ్య కార్యక్రమాలు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో అన్ని మండల, గ్రామ పంచాయతీ స్థాయిల్లో గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, మత్స్య శాఖ జెడి సురేష్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, సిపిఓ భరత్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ, పౌరసరఫరాల శాఖ డిఎస్ఓ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎత్తులు..పొత్తులు..

(మొదటిపేజీ తరువాయి)

సాగిస్తున్నారు. తెలుగుదేశం క్యాడర్ జనసేనతో జతకట్టాలనే గట్టిగా కోరుకుంటోంది. ఎందుకంటే ఇదే జరిగితే 2014 ఎన్నికల్లో పరిస్థితి వస్తుందని అంచనా వేస్తున్నారు. అప్పట్లో జనసేనతో పోటీచేయడం వల్లనే గెలిచామనే భావన ఉంది. 2019లో విడివిగా పోటీచేయడం వల్ల జనసేన వల్ల ఒంగోలుతో పాటు పలుచోట్ల ఓటమి పాలయ్యామనే అంచనాల్లో ఉన్నారు. జనసేనకు ఇక్కడ కొన్ని సీట్లు కేటాయింపులపైనా చర్చలు సాగుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పర్చూరు, దర్శి, గిద్దలూరులో జనసేనకు బలం ఉంది. ఒంగోలులోనూ ఆ పార్టీ సామాజికంగా బలం ఉంది. అయితే గత ఎన్నికల్లో ఆ స్థాయిలో జనసేన అభ్యర్థికి ఓట్లు రాలేదు. తెలుగుదేశం అభ్యర్థి ఓటమికి కారణాల్లో జనసేన పోటీ కూడా ఒకటిగా భావించుకున్నారు. గెలుపు,ఓటములపై సాగే అంచనాలు ఓట్ల ఆధారంగానే ఉంటాయి. ఇక వైసిపిలో సీటుపై నమ్మకం లేని నేతలు కొందరు జనసేనవైపు చూస్తున్నారనే చర్చలు సాగుతున్నాయి. మరోవైపు జనసేన నేతలు కూడా ప్రభుత్వంపైనా, వైసిపి నేతలపైనా విమర్శలు పెంచారు. అయితే బిజెపితో ఎలాంటి వ్యూహం ఉంటుందనేదీ స్పష్టత రాలేదు. టిడిపి, జనసేన పార్టీల నడుమ పొత్తులేకుండా చేయాలనే వ్యూహంలో వైసిపి ఉందనే చర్చ కూడా నడుస్తోంది. ఇలా ఎత్తులు, వ్యూహాలతో ఎన్నికల వైపు అడుగులైతే వేగంగానే పడుతున్నాయి.

తెలుగు జాతికి చారిత్రాత్మక రోజిది

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు, తెలుగు జాతి చరిత్రలో ఒక చారిత్రాత్మకమైన రోజని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. ఎన్‌టిఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నేటికి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ ఏర్పాటుతోనే తెలుగు వారి జీవితాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయన్నారు. తెలుగు జాతి ప్రయాణాన్ని 1983లో తెలుగుదేశం ప్రభుత్వం ఆవిర్భావం ముందు టిడిపి ప్రభుత్వం ఆవిర్భావం తరువాత చూడాల్సిన అవసరం ఉందన్నారు. నాటి దారుణ రాజకీయ పరిస్థితులు, ప్రజల వెతలు చూసిన ఎన్‌టిఆర్ పేదరికం లేని సమాజం కోసం పార్టీ పెట్టి 9 నెలల్లో అధికారం చేపట్టారన్నారు. రూ.2లకే కిలో బియ్యం, భూమి శిస్తు రద్దు, సింగిల్ విండో విధానం, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, రూ. 50 లకే రైతులకు హార్స్ పవర్ విద్యుత్, మహిళలకు ఆస్తిహక్కు, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, వద్ధులకు పింఛన్లు, జనతా వస్త్రాలు వంటి సంక్షేమ, విప్లవాత్మకమైన కార్యక్రమాలు అమలు చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందని గుర్తు చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు

ఒంగోలు కలెక్టరేట్ : సంక్షేమ ప్రదాత జగన్మోహన్ రెడ్డి అని మాజీ మంత్రి శిద్ధా రాఘవ రావు తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకొని సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శిద్ధా రాఘవరావు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్ర 4 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చక్కటి మార్పు తెచ్చేందుకు ప్రజా సంకల్ప యాత్ర చేసి నేటికీ 4 ఏళ్లు అయిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి కుటుంబానికి అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, ఆసరా, పెన్షన్ వంటి నాలుగైదు పథకాలు అందుతున్నాయన్నారు. వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్నారని పేర్కొన్నారు.

చీకటి జీవోను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-దర్శి

రోడ్లపై ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర తీసుకొచ్చిన జీవో నంబర్ 1ని రద్దు చేయాలని సిపిఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. జీవో నంబరు 1ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక గడియార స్తంభం సెంటర్ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం జీవో నంబరు 1 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 1తో ప్రజల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పు నారాయణ, ఈమని నాగేశ్వరరావు, పుల్లయ్య, జాన్, అంజిబాబు, ఆదినారాయణ, మోహన్ రావు, శ్రీను, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

డాక్టర్ వైష్టవికి ఉత్తమ అవార్డు

కొత్తపట్నం : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ ఎం. వైష్ణవిని విజయవాడ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారు ఉత్తమ డాక్టర్‌గా ఎంపిక చేశారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా డాక్టర్ వైష్టవి సోమవారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గత అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం మెరుగుకు చేసిన కృషికి ఉత్తమ డాక్టర్‌గా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ మాధవిలత, డిటిసిఒ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-దర్శి

రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై దొనకొండ, కొనకనమిట్ల, మార్కాపురం మండలాలకు చెందిన రైతులకు శిక్షణ సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామస్వరాజ్ ఆధ్వర్యంలో ఐసిసి-ఎంఎస్‌కె వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అధికారుల సూచనల మేరకు పురుగు మందులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్ర మంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వరరెడ్డి, లీలాకృష్ణ, కాశివిశ్వనాథ్, జాన్, రవి, డి. గోపాల్, శంకర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ డి.మానస

ప్రజాశక్తి- మద్దిపాడు

గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. డి మానస తెలిపారు.స్థానిక పిహెచ్‌సి లో ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వ హించారు. డాక్టర్ మానసన ఆధ్వర్యంలో 35మంది గర్భిణులకు హిమో గ్లోబిన్ శాతం, బిపి, బ్లడ్ గ్రూప్, గర్భంలో శిశువు కదలికలు తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణు లతో ముఖాముఖి నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్ పిఎస్‌లు, ఆశా వర్కర్లు గర్భిణులను ఆరోగ్య పరిస్థితులను ప్రతిరోజూ గనమిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లలితమ్మ, పిహెచ్ఎన్. రజిత కుమారి, ఎంపిహెచ్ఒ. వెంకరెడ్డి, నాగేశ్వర రావు బాలకోటయ్య, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మానస

అద్దె బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

అద్దె బస్సులు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్ : జగనన్న బడుగు వికాసం పథకాన్ని ఎస్‌సి, ఎస్‌టిలు వినియోగించుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఐదు అద్దె బస్సులను సోమవారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.మధుసూదన్ రెడ్డి, ఎల్‌డిఎం యుగంధర్ రెడ్డి, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్లు పి.ప్రసాద్, ఆనంద్, మంగమూరు రోడ్ బ్రాంచ్ మేనేజర్ పి.సురేష్, అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఎల్‌పిఒ శ్రీనివాస్ డిక్కీ ప్రతినిధులు ఏ.ఆశీర్వాదం, వి.భక్తవత్సలం పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్ నెంబర్ 267/2017

నగలపాటి ఆదినారాయణ ...వాది

వర్సెస్

చెన్నంశెట్టి నాసరయ్య ...ప్రతివాది

టు,

చెన్నంశెట్టి నాసరయ్య
తండ్రి: నాసరయ్య, వ్యాపారం,
రాధాక్రిష్ణ సినిమా థియేటర్ దగ్గర,
మార్కాపురం టౌన్, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది ప్రతి వాదిపై ప్రొ నోటు బాకీ రాబట్టు నిమిత్తం కోర్టులో దాఖలు చేసినారు. ఎన్ని పర్యాయములు దావా సమనులు జారీ చేసిననూ ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఆర్డర్ వేసినారు. కావున తేదీ: 23-01-2023 ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో నీపరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 23-01-2023 **రాళ్లభండి శ్రీకృష్ణయ్య**
మార్కాపురం **అడ్వకేట్, మార్కాపురం.**

IN THE COURT OF THE SENIOR CIVIL JUDG: BAPATLA.
E.P. No.1 of 2018 in
O.S. No. 15 of 2009.

Between:

Gopalam Ramaswami Naidu ...D.Hr.

V/S

MuchuVenkateswaramma ...JDr.

పై నెంబరు ఇ.పి. వారంటు మొత్తము వసూలుకు ఈ దిగువ పై నెంబరు దాఖలా స్థిరాస్థిని పై కోర్టు వారి ఎదుట ది.16-02-2023న ఉదయం గం.10-30 ని॥ లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు పాటలోపాల్గొని పాడుకొనవచ్చును. ఇతర వివరములు శ్రీ కోర్టు నాజరుగారి వద్దగాని లేదా డి. హెచ్.ఆర్. న్యాయవాది వద్ద గాని తెలుసుకొనవలెను.

ఇ.సి. దాఖలా రు. 2,00,000/-లకు గోపాళం రామస్వామి నాయుడు, రైలుపేట, బాపట్ల వారికి ది. 5-9-2005న ఎస్.ఆర్.ఒ., బాపట్ల ద్వారా అస్వాధీనపు తనఖా కలదు.

Narasaraopet Regn District - Bapatla Sub-Dist - Karlapalem Panchayat - Karlapalem Mandalam at D.No. 1010 - Door No.5-133/A, Daba house an extent of 338 sq. yards built: 460 Sq. Feet house. bounded by:
East: Panchayat Bazar
South: Pittu Subba Reddy etc. site.
West: Atla Subba Reddy etc,
North: Panchayat Bazar site.
D.Hr. value : Rs.6,00,000/-
Amin Value: Rs. 12,00,000/-
Proclamation and sale :16-02-2023.
Further hearing: 23-02-2023.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

సి. రవికుమార్,
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, బాపట్ల.
Cell No: 9346208137.

వేలం ప్రకటన

In the court of the Hon'ble Principal Senior Civil judge at Bapatla
E.P No: 45/2019 In O.S No: 200/2015

Between:-
Immadisetty Viswanadarao ,S/o Kesavarao Hindu aged about 42 yers, Pravite Employee, R/o Door No: No: 4-107, 24th ward ,Immadisettivari Palem, Bapatla town, & district, Bapatla SCJC...Petitioner/DHR

And

Parisa Nagamma,W/o Kondala Reddy, Hindu ,aged about 43years, House wife, R/o door No: 3-222, Pedapuluguvaripalem Village,Karalapalem Mandal, Bapatla town and district...Respondent /JDR

పై నెంబరు ఇ.పి అమలు నిమిత్తం ఈ దిగువ ఉదహరించిన జె.డి.ఆర్ కు చెందిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 9-02-2023న ఉదయం గం॥10:30 ని॥లకు లగాయితు పై కోర్టు లో బహిరంగ వేలం వేయబడును. వేలం పాట పాడదలసిన వారు వేలంలో పాల్గొన గలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

Shedule Item No:1 Guntur District- Narasaraopet Regn, district - Bapatla sub registration District, Peddpuluguvari Palem, Panchyathi H/o Ganapavaram Taluk bearing D.No: 924/4,In thatTotal Extent is Ac 0.66 Cents In that Total Extentis 1.02cents inthat Parasa Nagamma is having Ac 0.22Cents and D.No:923/5in that Total Extent is Ac, 1.02 Cents in that Parasa Nagamma is Having Ac 0.69 Cents Bounded by East: land of Parasa VenkateswaraReddy, South: land of Parasa Gopala Reddy, West:Land of Parasa Gopala Reddy, North:Panta Kalava In between boundaties the Parisa Nagamma is having Ac 0.47 Cents or 0.276 Hectors of Culitivation land.

Shedule Item No:2 Guntur District-Narasaraopet Regn, district - Bapatla sub registration District, Peddpuluguvari Palem Panchyathi H/o Ganapavaram Taluk bearing D.No: 923/8, in that Total Extent is Ac 0.78 Cents In that Parasa Nagamma is having Ac 0.48Cents and Bounded by East: Donka ,South: land of Akkala Koti Reddy, West :Panta Boda,North:Land of Komattla SubbaReddy In between boundaties the Parisa Nagamma is having Ac 0.48 Cents or 0.192 Hectors of Culitivation land

గమనిక : జె.డి.ఆర్ కు షెడ్యూలు ఆస్థి యందు పూర్తి హక్కులు కలవు ఇ.సి దాఖలా అన్యక్రాంతములు లేవు

D.H.R Value Rs.9,00,000/-
Ameena Value 15,00,000/-
SRO, Bapatla Value: 8,19,000/-
Order date: 27-12-2022,
Auction date: 09- 02-023,
Further Hearing 16-02-2023
Date: 09-01-2023,
Bapatla.

ఇట్లు :-

Immadisetty Suresh Babu
Advocate, M.com, M.D.C.A, M.B.A.,L.L,B.,
Advocate, D,No: 4-127, 24warad, Bapatla-522101, Town & District. Cell No: 9440916824

ప్రజాశక్తి
మంగళవారం 10 జనవరి 2023

ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఇంకొల్లు ఎన్‌ఆర్ అండ్ వివిఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాలలో కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 4 వేదికలు ఏర్పాటు చేశారు. వేదికల ప్రాంగణంలో ఎన్‌టిఆర్ వివిధ వేషధారణలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. శతజయంతి వేడుకలను కాకతీయ కన్వెన్షన్ సొసైటీ గుంటూరు అధ్యక్షులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చేసిన సేవలను కొనియాడారు. తొలుత చర్లపల్లి వారిచే డబ్బుల జానపద కళామేళ నిర్వహించారు. అల్లూరి వారిచే శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మహిళా కోలాట ప్రదర్శన జరిగింది. అనంతరం ఒంగోలుకు చెందిన శ్రీ నళిని ప్రియా కూచిపూడి నృత్య కళానికేతన్ వారిచే ఎన్‌టిఆర్ శతజయంతి నృత్యగీతిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహారథి కర్ణ ఏకపాత్రాభినయం, నేను దొంగను కాను ఏకపాత్రాభినయం, శ్రీచైతన్య కళాస్రవంతి విశాఖ వారిచే దెయ్యం నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, కాకతీయ కన్వెన్షన్ సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి రమేష్‌కృష్ణ, కోశాధికారి దామచర్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్తపల్లి రవీంద్రబాబు, జెట్టి వెంకటేశ్వర్లు, కొల్లూరి నాయుడమ్మ, కరి కమలేశ్వరరావు, వై దాసు, ఎస్ రామ్మోహన్ రావు, కరి అమ్మయ్యచౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి ఉదయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభ సభలో మాట్లాడుతున్న డాక్టర్ యర్రా నాగేశ్వరరావు

'విదేశీ విద్య' పథకానికి ఎంపిక

ప్రజాశక్తి-అద్దంకి

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపికైన అద్దంకి పట్టణం కాకానిపాలేనికి చెందిన గుండ్లకమ్మ పత్రిక ఎడిటర్ సందిరెడ్డి కొండలరావు కుమారుడు సందిరెడ్డి సుఖేష్‌ను ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అభినందించారు. సుఖేశ్ అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన విస్కాన్సిన్ యూనివర్సిటీ ఆఫ్ లా కాలేజీలో ఎల్‌ఎల్‌ఎం పీజీ కోర్సులో అడ్మిషన్ పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద ప్రపంచవ్యాప్తంగా మొదటి వంద టాప్ ర్యాంకు యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నూరు శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 లక్షల మేర ఫీజును సుఖేష్‌కు రీయింబర్స్ చేయనున్నది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణ చైతన్య ద్వారా ఈరోజు ఎంపిక పత్రాన్ని అందుకున్న సుఖేష్ ఈ నెల 11వ తేదీన అమెరికా వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సందిరెడ్డి సుఖేష్ మాట్లాడుతూ ఈ పథకం కింద తాను ఎంపికైనందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాచిన చెంచు గరటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆమంచిని గెలిపించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణ మోహన్‌ని గెలిపించే లక్ష్యంగా పని చేయాలని వైసీపి నియోజకవర్గ పరిశీలకులు చుండూరి రవిబాబు కార్య కర్తలకు సూచించారు. పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో పర్చూరు నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం మండల కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన సోమవారం జరిగింది. తొలుత బొమ్మల సెంటర్‌లో వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిశీలకులు చుండూరి రవిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో దండా చౌదరి, బండారు ప్రభాకర్, కారం చేడు జడ్పీటీసీ యార్లగడ్డ రజని, పఠాన్ కాలేషావలి, పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, నన్నెబోయిన వెంకటప్పయ్య, చీరాల ఏఎంసి చైర్మన్ మార్పు గ్రగోరి పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల మృతదేహాలను పరిశీలిస్తున్న సిఐ రాజమోహనరావు, ఎస్ఐ సమందర్ వలి

వృద్ధ దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-అద్దంకి

అనారోగ్య కారణాలతో వృద్ధ దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పట్టణ పరిధిలోని నర్రావారిపాలెంలోని కట్టావారిపాలేనికి చెందిన కట్టా వెంకయ్య(81) వెంకాయమ్మ(75) దంపతులు వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలు తోడవడంతో ఈ చర్యకు పాల్పడినట్లు బంధువులు చర్చించుకుంటున్నారు. బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిఐ రాజమోహనరావు, ఎస్ఐ సమందర్‌వలి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వృద్ధ దంపతులు వెంకయ్య, వెంకాయమ్మ (ఫైల్)

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కడతేరిన కూలి బతుకు

మిర్చి కోతకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
ముగ్గురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలేనికి చెందిన 60 మంది కూలీలు మిర్చి కోతకు త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ గ్రామానికి సోమవారం ఉదయం మినీ లారీలో 60 మంది దాకా బయలుదేరి వెళ్లారు. దూపాడు గ్రామం సమీపంలోకి వెళ్లేసరికి మినీ లారీ డోరు తెగిపడింది. దీంతో దూదేకుల బీబీ(45) అనే మహిళా కూలీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని యర్రగొండపాలెంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సలు జరిపించారు. మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. త్రిపురాంతకం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో యర్రగొండపాలెం సమీపం లోనే మిర్చి కోత కూలీకి వెళ్లి వస్తూ రెండు ఆటోలు ఢీకొని ముగ్గురు కూలీలు మృతి చెందారు. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ ఘటన మరువక ముందే తిరిగి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉపాధి పనులు కల్పించకపోవడం మూలంగానే వీరంతా ఇతర పనులకు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఏది ఏమైనా ప్రతియేటా యర్రగొండపాలెం పరిసరాల్లో కూలీల బతుకులు ప్రమాదాల్లో కడతేరుతుండడం విషాదం.

మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక తూర్పు బైపాస్‌రోడ్డులో జరగిన రోడ్డు ప్రమాదంలో వేటగిరి మస్తాన్(35), కత్తి అఖిల్(25) మృత్యువాతపడ్డారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కొత్తపట్నం మండలం రాజుపాలేనికి చెందిన వేటగిరి మస్తాన్, కత్తి అఖిల్‌లు చీమకుర్తి మండలంలోని మువ్వావారిపాలెంలో గత వారం రోజులుగా ఉంటూ కర్ర కోత పని చేస్తున్నారు. సోమవారం కూరగాయల కోసం రెండు మోటారు సైకిళ్లపై నలుగురు చీమకుర్తి వెళ్లారు. అక్కడ కూరగాయలు కొనుగోలు చేసి మృతులు మస్తాన్, అఖిల్‌లు మోటారు సైకిళ్ల నడుపుతున్నారు. వెనుక మరో ఇరువురు కూర్చున్నారు. తూర్పు బైపాస్‌లో బయో పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో మస్తాన్, అఖిల్‌లు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న ఇరువురికి గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ వి ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దగ్గుబాడులో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రకాశం, బాపట్ల, గుంటూరు, మూడు జిల్లాల స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు ఈ నెల 13 నుంచి జరగనున్నాయని దగ్గుబాడు సర్పంచి పర్చూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం కన్వీనర్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 12వ తేదీ లోపు ఎంట్రీ ఫీజు రూ.999 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పొగాకు బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి-కొండపి: బ్యారన్ దగ్ధం అయిన సంఘటన కొండపి మండలంలోని కట్టావారి పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ల వెంకటేశ్వర్లు (టిబిజిఆర్ నెం.25.025.103) బ్యారన్ క్యూరింగ్‌లో ఉన్న సమయంలో అల్లుడు కర్ర మొద్దుగొట్టంపై జారి పడడంతో బ్యారన్ దగ్ధం అయిందని అన్నారు. ఆ బ్యారన్‌లో రూ.3 లక్షల విలువ చేసే ఆస్తి మొత్తం అగ్నికి ఆహుతి అయిపోయింది. అందులో క్యూరింగ్‌లో 1050 కర్ర ఉన్నదని, దానిలో ఉన్న పొగాకు సుమారు రూ.1.60 లక్షల విలువైన పొగాకు దగ్ధం అయ్యిందన్నారు. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొనే సమయానికి మొత్తం బ్యారన్ దగ్ధం అయింది.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

అక్రమ కట్టడాలను కూల్చి వేయాలి ● ఆక్రమణలతో రహదారిని కోల్పోయిన బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-మార్కాపురం

పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు ఎస్సీ కాలనీలో అదే ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఏకంగా రహదారిలో గృహాలు నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమించారు. ఆక్రమణల ఫలితంగా పలువురి గృహాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. బహిరంగంగా జరిగిన ఆక్రమణలపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంతంలో రహదారిని కోల్పోయిన బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. వాస్తవాలు విచారించిన అనంతరం హైకోర్టు డబ్ల్యుపి నెంబర్ 11391/2021 ద్వారా అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. అక్రమ కట్టడాలను తొలగించేందుకు 2022 డిసెంబర్ 30వ తేదీన పంచాయతీ అధికారులు సిద్ధమయ్యారు. ఇద్దరు సిఐలు, ముగ్గురు ఎస్ఐలతో పాటు 50 మంది పోలీస్ సిబ్బంది అక్రమ కట్టడాలను కూల్చివేసే సమయంలో బందోబస్తుగా కూడా వచ్చారు. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు కానీ... ఇరుకు రహదారిని తయారు చేసి అక్రమ కట్టడాలను కూల్చకుండా వదిలేశారు. అక్రమ కట్టడాల వెనుక నివాస గృహాలకు అక్రమ కట్టడాలు తొలగించని కారణంగా రాకపోకలకు ఇబ్బందులు మాత్రం ఎప్పటి మాదిరిగానే ఉన్నాయి.

దీంతో బాధితులు న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నారు. బాధితుల్లో ఒకరైన గంగవరపు విజయరావుతో పాటు పలువురు బాధితులు పెద్దారవీడు తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. విజయరావు మాట్లాడుతూ ఆక్రమణదారులు గతంలో తనపై, తన భార్యపై కూడా కబ్జాదారులు దాడి చేశారన్నారు. పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైందన్నారు. అక్రమ కట్టడాలతో తమ నివాసాలకు రహదారి లేకుండా పోతోందని గతంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులను వేడుకున్నామన్నారు. చివరకు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను కూడా తమకు న్యాయం చేయాలని కోరినా ఫలితం లేకపోయిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులు కూడా అక్రమ కట్టడాలను కూల్చివేయాలని వచ్చినా... స్థానికంగా అధికారులు అక్రమ కట్టడాలు తొలగించలేదన్నారు. మంత్రి డాక్టర్ సురేష్ అధికారులపై ఒత్తిడి చేయడంతో ఆక్రమణల తొలగింపు నిలిచిపోయిందని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. రహదారిలో అక్రమ కట్టడాలను తొలగించాలని, తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

మాట్లాడుతున్న గంగవరపు విజయరావు

అక్రమాలు సహించం

- నిత్యావసర సరుకులు పేదలకు చేరాలి
- భూముల రీసర్వే ప్రక్రియ వేగంగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైస్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ నిత్యావసర సరుకులు అందించే బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. పేదలకు చేరాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ చెప్పారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు వెళ్లే వాహనాల ఫొటోలను దశలవారీగా కలెక్టర్ గ్రూపులో పంపాలన్నారు. 18 రోజులపాటు ప్రజలకు సరుకులు సరఫరా చేయాలన్నారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి విఆర్ఓలు ధృవీకరించాలన్నారు. ప్రతి దుకాణానికి వాహనం చేరినట్లు ఫొటోలు పంపాలని, పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి సరుకులు ఎండియు వాహనం ద్వారా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల అద్దంకి మండలంలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నిత్యావసర సరుకులు నేరుగా నల్లబజారుకు తరలి వెళ్లాయని కలెక్టర్ గుర్తుచేశారు. అద్దంకి మండలంలో 290 దుకాణాలుండగా 102 ఎండియు వాహనాల ద్వారా పంపిణీ చేసే అంశంపై ఆరా తీశారు. భూముల రీసర్వే ప్రక్రియ వేగంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొరిశపాడు మండలంలో సర్వే జరిగినా నేటికీ హద్దురాళ్లు వేయకపోవడంపై కలెక్టర్ అధికారులను నిలదీశారు. నిబంధనల ప్రకారం గడువు తీరినప్పటికీ రాళ్లు ఎందుకు వేయలేదని కలెక్టర్ మండిపడ్డారు. మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో 613 ఎకరాలకు నెంబర్లు కేటాయించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రేపల్లె మండలంలో భూములకు సంబంధించిన అర్జీలు గడువు దాటినప్పటికీ పరిష్కరించకపోవడంపై రేపల్లె తహశీల్దారుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారులు రబ్బరు స్టాంపులు మాదిరిగా పనిచేయవద్దన్నారు. విధి నిర్వహణపై అవగాహన కలిగివుండాలని, బుద్ధి, విచక్షణ, నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నాలా భూములపై పున్ణపరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనన్నారు. ప్రభుత్వ భూమిని దస్త్రాల్లో చూపించకపోవడంతో ఒక తహశీల్దారుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములకు తహశీల్దారులే సంరక్షకులనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు.

రెవెన్యూ అంశాలపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న ధాన్యం పంట అంచనాలపై పున్ణవిచారణ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతుల వివరాలు, వృథా అయిన ధాన్యం వివరాలు, పంట దిగుబడి అంచనాలపై నివేదిక పంపాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు వస్తే జిల్లా సంయుక్త కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. శ్మశాన భూములు లేని గ్రామాలకు తక్షణమే భూమి గుర్తించే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. చీరాల రెవెన్యూ డివిజన్లో 24 గ్రామాలకు శ్మశాన భూమి లేదని, రేపల్లె రెవెన్యూ డివిజన్లో 37 గ్రామాలకు, బాపట్ల రెవెన్యూ డివిజన్లో 18 గ్రామాలకు శ్మశాన భూమి లేదన్నారు. ఆ గ్రామాల కోసం ఇప్పటివరకు 45 ఎకరాలు గుర్తించగా మిగిలినవి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అన్నారు. సొసైటీల కింద సాగుచేస్తున్న ఐదు వేల ఎకరాల భూములను పరిశీలించి నివేదిక పంపాలన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరపాలన్నారు. మాజీ సైనికులకు భూమి కేటాయింపులపై దరఖాస్తులను పరిశీలించాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియలో జాప్యాన్ని అరికట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు తెలిపారు. మార్టూరు, సంతమాగులూరు, చీరాల, బల్లికురవ ప్రాంతాలలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. దస్త్రాల స్వచ్ఛీకరణ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలన్నారు. ఒక గ్రామాన్ని 90 రోజుల్లో పూర్తిచేయాల్సి ఉండగా లక్ష్యాలను విస్మరించారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆర్డిఓల పర్యవేక్షణ మరింత పెరగాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో డిఆర్ఓ కె లక్ష్మీ శివజ్యోతి, డిఎస్ఓ బి విలియమ్స్, డిసిఓ రామారావు, పౌర సరఫరాల సంస్థ డిఎం శ్రీలక్ష్మి, మండలాల నుంచి తహసీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

పశువుల్లో లంపి స్కిన్ పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పశువుల్లో లంపిస్కిన్ పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఇ హనుమంతరావు అన్నారు. సోమవారం పశు సంవర్ధక శాఖ, బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో మండల పరిధిలోని మరుప్రోలువారి పాలెం ముత్తాయిపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముద్దచర్మ వ్యాధి లంపీ స్కిన్ డిసీస్ నివారణ, జాగ్రత్తలు రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా తెల్ల పశువులకు వైద్యం చేశారు. ఈ శిబిరంలో రాష్ట్ర పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల వారు హాజరై పశువుల రక్త నమూనాలు సేకరించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల డాక్టర్ శ్రీలక్ష్మి, వెంకట సుబ్బారెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ టి శంకరరావు, కంకటపాలెం పశువైద్యాధికారి తిరుమల తేజ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన కార్యకర్తలు

టీడీపీలోకి చేరికలు

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మోర్తోట గ్రామ పంచాయతీలో సుమారు 100 మంది టిడిపిలో చేరారు. రేపల్లె మండలం మోర్తోట జంగాలవారిపాలెం గ్రామ పంచాయతీ నుంచి సోమవారం దాదాపుగా వంద మంది ఆళ్లమూడి ఉపేంద్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పార్టీకి అండగా నిలబడడం కోసం, చంద్రబాబు నాయుడును తిరిగి ముఖ్యమంత్రిగా చేయడం కోసం నేడు పార్టీలో చేరుతున్న నాయకులకు పూర్తి అండదండలతో అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నేడు చేరిన నాయకులే మోర్తోట గ్రామ అభివృద్ధి వారి ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతుంది అని భరోసా కల్పించారు. అవసరాలు, అవకాశాలు కోసం మాత్రమే వచ్చే నాయకులను సరైన సమయంలో సరైన సమాధానం చెప్తామని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. రైతులకు మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతు ద్రోహిగా మిగిలిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడు చందుకి విరాళం అందిస్తున్న షాజిద్

అమ్మ ఆశ్రమానికి ఎన్ఆర్ఐ వితరణ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్: ఆసరా లేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న అమ్మ ఆశ్రమానికి ఎన్ఆర్ఐ చేయూత అందించారు. కర్నూలు జిల్లా ఇరిగేషన్ శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మార్టూరుకు చెందిన కబీర్ బాషా, బల్లికురవ మండలం అంబడిపూడి జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నూర్జహాన్ దంపతుల కుమారుడైన షాజిద్ యూఎస్ఏలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల ఇండియా వచ్చిన షాజిద్ మార్టూరులో అమ్మ ఆశ్రమం ద్వారా వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణం కోసం ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందుకు తన తల్లిదండ్రులతో కలిసి సోమవారం రూ.25,000 నగదును విరాళంగా అందించారు. షాజిద్‌ను, గతంలో కూడా రూ.70,000 నగదు విరాళంగా అందించిన ఇంజినీర్ దంపతులను ఆశ్రమ నిర్వాహక కమిటీ అభినందించింది.

ఆటల పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

సత్తా చాటిన బాపట్ల పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఇటీవల గుంటూరులో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ ఆటల పోటీలలో బాపట్ల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టపడితే తప్పక ఫలితం ఉంటుందని అన్నారు. కష్టపడి ఆడి కబడ్డీ వాలీబాల్ ఫస్ట్ ప్లేస్‌లో నిలబడటం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. సెక్రెటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలేజీకి ఎటువంటి సదుపాయాలు కావాలన్నా విద్యార్థులందరూ సదుపాయాలను వినియోగించుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్ జి దిలీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. కరస్పాండెంట్ కె హరి పద్మ ప్రసాద్ మాట్లాడుతూ చాలా తక్కువ సమయంలో బాగా ప్రాక్టీస్ చేసిన విన్నర్స్, రన్నర్స్ అభినందనీయులన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ టి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి ఆటలు పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విజయాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్‌లలో స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించారు.

మాట్లాడుతున్న ప్రత్యూష సుబ్బారావు

టిటిడి కళ్యాణ మండపం పరిశీలన

ప్రజాశక్తి-మేదరమెట్ల: మేదరమెట్లలో ఈనెల 13వ తేదీన తిరుపతి తిరుమల దేవస్థానం అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న టిటిడి కళ్యాణ మండపం, ప్రజా వైద్యశాలను సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ వైవి భద్రారెడ్డి పరిశీలించారు. వైసిపి యువ అధ్యక్షులు బొనిగల మధు, అనమనమూరు సర్పంచ్ జంపు హరిబాబు, ఈద శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రజలపై నిర్బంధం తగదు

- ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి
- సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్రంలో ప్రజలపై నిర్బంధం ఎత్తివేయాలని, ఆర్బికేలా ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సీపీఎం సభ్యులు, సానుభూతిపరుల సమావేశంలో సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వాళ్లకు లీజు పేరుతో తాకట్టు పెడుతున్నారని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. అంబానీ, అదానీలాంటి వ్యాపారవేత్తల ఆస్తులు రోజు రోజుకూ పెరుగుతున్నా.. కార్మికులు, కూలీల వేతనాలు పెరగటం లేదని అన్నారు. బిజెపి విధానాల వల్ల పేద ప్రజలు రోజు గడవక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని, నిరుద్యోగ సమస్య పెరుగుతోందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటున్న బిజెపి.. దేశం అభివృద్ధి వైపు వెళుతోందని ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిరకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజా సమస్యలపై ఎవరూ రోడ్డు మీదకు రాకుండా జిఓలు ఇవ్వటం దుర్మార్గమన్నారు. ఈ జీఓను అడ్డంపెట్టుకొని పోలీసుల ద్వారా ప్రజలను బెదిరించడం ప్రజల హక్కులు కాలరాయటమేనని విమర్శించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయటంలో ప్రభుత్వం వెనకపడిపోయిందని, తేమ శాతంతో ముడి పెట్టడంతో రైతులు నష్టపోతూ దళారులకు అమ్ముకొంటున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి ప్రకటనలు ఇచ్చి ఇప్పుడు రోడ్డున పడేశారని విమర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్, సీపీఎం నేతలు డి శ్రీనివాసరావు, ఆగస్టిన్, యూ రామకృష్ణ, ఎన్ శివశంకర్, నవీన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి -శింగరాయకొండ

జనవరి నెలలో 9 రోజులు గడిచినప్పటికీ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేదు. దీంతో తమకు వెంటనే పెన్షన్లు ఇవ్వాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగులు స్థానిక తహశీల్దారు కార్యాల యం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ తమకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే నేటికీ ఇవ్వలేదని తెలిపారు. దీంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల ప్రెసిడెంట్ కె. నాగేశ్వరరావు, కె.చక్రపాణి, కె.అంకయ్య , ఎల్.గిరిరాజు ,జి.వెంకటేశ్వర రావు, జి. కష్ణ తదితరులు పాల్గొన్నారు. **గిద్దలూరు :** ప్రతినెలా ఒకటో తేదీన తమ బ్యాంకు ఖాతాల్లో పెన్షను నగదును జమ చేయాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగులు స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటవ తేదీన పెన్షను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవరావు, బాల ఈశ్వరయ్య, ఏసేబు, మూర్తేయ్య, రంగయ్య, భాస్కర్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

శింగరాయకొండలో ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గిద్దలూరులో ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జాతీయ స్థాయి పోటీలకు పేస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-టంగుటూరు

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ విద్యార్థి ఎంపికైనట్లు పేస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. ఈనెల3న విజయవాడ లోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జెఎన్‌టియుకె పురుషుల విభాగంలో జరిగిన పోటీలలో పేస్ కళాశాల ద్వితీయ సంవత్సరం చదువుతున్న సివిల్ విభాగం విద్యార్థి సంతోష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13 నుంచి 17 వరకూ మంగళూరు యూనివర్శిటీలో నిర్వహిస్తున్న అంతర విశ్వవిద్యాలయాల పోటీలల్లో సంతోష్ పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన సంతోష్‌కు కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, స్టూడెంట్స్ డీన్ ఎఫైర్ వీరాంజనేయులు, ఎఒ రమణబాబు, సివిల్ విభాగాధిపతి గణేష్ నాయుడు, పీడీలు మధు, రాజు, నాసరయ్య, రవి, కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు జిల్లా అధ్యక్షుడు టి.విజయకుమార్, కార్యదర్శి జి.ఆశాజ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎండి హాజీర బేగం, జిల్లా నాయకురాలు డాక్టర్ ఖాదర్ మస్తాన్ బి, మాకినేని మురళి, నర్సయ్య, వి. పద్మావతమ్మ, మార్పూడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డు భూముల్లోని..

వెంచర్లను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కనిగిరి

అసైన్‌మెంట్ భూముల్లో వేసిన వెంచర్లను తొలగించి అందులో పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. కొండారెడ్డి, కనిగిరిపట్టణ కార్యదర్శి పిసి. కేశవరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు తమకు ఇంటి పట్టాలు, భూములు పంపిణీ చేయాలని అడిగితే అధికారులు భూములు లేవని చెబుతున్నట్లు తెలిపారు. అయితే అసైన్‌మెంట్ భూముల్లో రియల్టర్లు వెంచర్లు వేసి ప్రజలను మోసం చేస్తుంటే అధికారులు ప్రేక్షకపాత్ర పోషించటం దారుణమన్నారు. మున్సిపల్,రెవెన్యూ అధికాలతో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వెంచర్లను పరిశీలించి అర్హత ఉన్న వాటికే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం కనిగిరి పట్టణ నాయకులు ఎం. కొండారెడ్డి,ఎస్‌కె. బషీరా,ఎస్‌కె. ఖాశీంవలి, శాంతకుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

సచివాలయ కన్వీనర్లు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక హారిత రిస్టార్స్‌లో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం అందేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ, జడ్‌పిటిసి లతాబాయి, సర్పంచి చిత్తూరి హారిక, ఉప సర్పంచి దూదేకుల రసూల్, వైసిపి నాయకులు గంటా గురువారెడ్డి, చంద్రకాంత్, వెంకట నారాయణ, వెన్నా కాశిరెడ్డి, పవన్ కుమర్, నెక్కంటి వెంకటేశ్వరరెడ్డి, దర్శం నాగయ్య, సీతారామయ్య, గుమ్మా యల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి : మంత్రి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వైసిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానికనటరాజ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ, జడ్‌పిటిసి లతాబాయి, సర్పంచి చిత్తూరి హారిక, వైసిపి నాయకులు గంటా గురువారెడ్డి, జోగి వెంకట నారాయణ, వెన్నా కాశిరెడ్డి, పవన్ కుమర్, నెక్కంటి వెంకటేశ్వరరెడ్డి, దర్శం నాగయ్య, సీతారామయ్య, గుమ్మా యల్లేష్ పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్ :** ప్రతిపక్ష నేత హోదాలో అనేక యాత్రలు చేసి రాష్ట్ర ప్రజల అభిమానం చూరగొని, అత్యధిక స్థానాల్లో వైసిపి జెండాను రెపరెపలాడించి అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకునిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి జిల్లా కార్యాయంలో సోమవారం కేక్ కత్తిరించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర ద్వారా జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేరువ అయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామనారాయణరెడ్డి, ఎంపిటిసి కొండ్రు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి మంచికల చిన్నకోటేశ్వరరావు, నాయకులు కల్లం దిబ్బారెడ్డి, సిగినం కొండయ్య, గొంగటి కరుణయ్య, పి.కొండారెడ్డి, యక్కంటి తిరుపతి రెడ్డి, పాలూరి వెంకటేశ్వర్లు, శ్యాంబాబు, పి.తిరుపతిరెడ్డి, యోసేపు, ఎస్.కరుణయ్య పాల్గొన్నారు. **పొదిలి :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక విశ్వనాధపురం సెంటర్, పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ సెంటర్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర పంచాయతీ అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగం, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకట రెడ్డి , వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసుల రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, జిల్లా వైసిపి కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, గూడూరి వినోద్ కుమార్, మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ మస్తాన్ వలి, పులగొర్ల శ్రీనివాసులు, పేరం కోదండ రామిరెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, పేరం చెంచిరెడ్డి, ఫిరోజ్, రాములేటి మస్తాన్, తల్లపురెడ్డి వెంకట నారాయణ రెడ్డి, మల్లాపురం చిన్న నరసింహులు, ముల్లా బ్రదర్స్ పాల్గొన్నారు. **తర్లుపాడు :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి సుబ్బారెడ్డి, సర్పంచి పల్లెపోగు వరాలు, కోఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, వైసిపి నాయకుడు పిన్నిక ప్రసాద్, సురేపల్లి సర్పంచి నవ్య తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎన్‌ఆర్‌ఇజిఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అడిపి కరుణాకర్ పాల్గొన్నారు.

దోర్నాలలో కేక్ కట్ చేస్తున్న మంత్రి సురేష్

ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, మేయర్ సుజాత

గొర్రెలు,మేకల పెంపకందారుల ధర్నా

ప్రజాశక్తి-పెద్దారవీడు

జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ మందులు, నాచు రోగం నివారణకు టీకాలు అందజేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. గాలికుంటు నివారణ మందులు, నాచురోగం టీకాలు ప్రభుత్వ పశు వైద్యశాలలో అంటుబాటులో ఉంచాలని కోరుతూ స్థానిక పశు వైద్యశాల వద్ద గొర్రె కాపరులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొమ్మనబోయిన శివయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తోట తిరుపతిరావు మాట్లాడుతూ పెద్దారవీడులో గత నెల రోజుల నుంచి గాలికుంటు వ్యాధితో గొర్రెలు నడవలేక నిరసించి చనిపోతున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన మందులో పశువైద్యశాలలో లేక పోవడం దారుణమని తెలిపారు. గత రెండేళ్లుగీఆ వివిధ రకాల జబ్బులు, ప్రమాదాలు, కుక్కల దాడిలో వందలాది జీవాలు మరణించినట్లు తెలిపారు. దీంతో పెంపకం దారులు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. బాధితులకు వైఎస్ఆర్ పశుపోషణ పథకం ద్వారా నష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. జిల్లాలో సుమారు రూ. 15 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ప్రతిఏడాది ఈ సీజన్‌లో గొర్రెలు, మేకలకు నాచు రోగం వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. దీని నివారణకు సంబంధించి టీకాలు ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో లేవని తెలిపారు. ఫలితంగా ప్రైవేటు మెడికల్ షాపుల్లో వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం మార్కాపురం మండల అధ్యక్షుడు నక్క గంగరాజు, కె.కాశయ్య, ఎం.కొండలయ్య, ఎం.ఆవులయ్య, పి.బాలయ్య, సిహెచ్. వెంకటేశ్వర్లు, బి.రాములు, వెంకటరాజు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

గడపగడపకూలో మంత్రి సురేష్

పేదల సంక్షేమమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. దోర్నాల-2 సచివాలయ పరిధిలో గడపగడకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, గంటా గురువారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ, సర్పంచి చిత్తూరి హారిక, పవన్ కుమర్, నెక్కంటి వెంకటేశ్వరరెడ్డి, దర్శం నాగయ్య, సీతారామయ్య, గుమ్మా యల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా జయంతి

యర్రగొండపాలెం :భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా జయంతి ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భ:గా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మహిళా టీచర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయులు, ఉర్దూ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు ముర్తుజ వలి, సునియం, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తర్లుపాడు : మండల పరిధిలోని చెన్నారెడ్డి పల్లె గ్రామంలో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోలార్ అడ్మిన్ ఎస్.సుబ్బారావు, సింగిల్ విండో అధ్యక్షుడు కుందురు సత్యనారాయణరెడ్డి, సంస్థ సిబ్బంది ఇ.శివకుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆధార్ సేవలు

కొమరోలు : మండల పరిధిలోని తాటిచెర్ల సచివాలయంలో ఆధార్‌సేవలను ఎంపిపి కామూరి ఆమూల్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలను మలినేని విద్యాసంస్థల ఫౌండర్ డాక్టర్ మలినేని లక్ష్మయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం భోగి మంటలు వేశారు. ఈ సంబరాల్లో శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ,జరుగుమల్లి ఎస్ఐ శ్రీనివాసరావు, డాక్టర్ రాచ కొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు..

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

తమ కళాశాలలో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలనే ఆకాంక్షతో అనేక రకాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్ తెలిపారు. ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నెల రోజుల నుంచి డేటా సైన్స్ మరియు పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు. అందులో సోమవారం నాటి కార్యక్రమంలో షంషీర్ అలిబేగ్ పాల్గొని పలు సలహాలు, సూచనలు చేశారు. ట్రైనర్ల సందేశాలను అందిపుచ్చుకుని సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని కోరారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామెన్ ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సెర్టిబాక్స్ ట్రైనర్ ఎం.రామ్‌నాథ్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు డేటా సైన్స్ విభాగంలో డిజిటల్ ఎర, ఎటానమస్ వెహికల్స్, రోబోట్స్, డ్రోన్, సెల్ప్ డ్రైవింగ్ వెహికిల్‌సలో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీధర్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనర్ రామ్‌నాథ్‌ను అభినందిస్తున్న విద్యార్థులు

ఇంటి స్థలాల కోసం 'స్పందన'లో వినతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నాం. రెక్కాడితే గానీ డొక్క నిండని పేదలం. మూడేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. అయినప్పటికీ అధికారులు కనికరించడం లేదని యర్రగొండపాలెం పట్టణంలోని చెంచు పాముల కాలనీకి చెందిన మహిళలు వాపోయారు. తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తమ గోడు వెళ్లడించారు. ఏ ఆధారం లేని తమకు మాత్రం పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, సుబ్బులు, కోటమ్మ, శాంతమ్మ, సుహాషిణి, లక్ష్మి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి చిన్నబస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ నేతపాలెం యువకులు తహశీల్దారు భాగ్యలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందేశారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ డానియెల్ జోసెఫ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహ కమిటీ నాయకులు ధర్నాసి పెద్దన్న మాట్లాడుతూ పొదిలిలో దళితులు, పేదలు అత్యధికంగా ఉన్న చిన్న బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చిన్నబస్టాండ్ సెంటర్‌లో సర్వే నెంబర్ 582లోని దేవస్థానం స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ రెవెన్యూ, దేవాదాయ, నగర పంచాయతీ అధికారులు, కనిగిరి ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు వడ్డే వేణు, అరిక రాము, బండి అశోక్, రాజు, హాజరత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు నేతపాలెం యువకుల వినతి

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న లక్ష్మణరెడ్డి

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ కింద సంవత్సరానికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు పంపిణీ చేయనున్నట్లు మా ఊరు అభివద్ధి కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి కష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ ఉప్పలపాటి ఆంజనేయులు, ప్రముఖ సినీ దర్శకులు బి.గోపాల్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మా ఊరు అభివద్ధి కమిటీ కోఆర్డినేటర్లు చిట్టేల రామిరెడ్డి, మల్లవరపు అంజిరెడ్డి, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ కె. శ్రీరామమూర్తి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే స్వామి

కొండయ్యకు ఎమ్మెల్యే స్వామి పరామర్శ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పదుముత్తం కొండయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం వెంకట రమణ ఆసుపత్రికి తరలించారు. వెంకట రమణ హాస్పిటల్ చికిత్స పొందుతున్న కొండయ్యను కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామా మురళి, శ్రీహరి, మహేంద్రబాబు పాల్గొన్నారు.

రిలే దీక్షలకు సంఘీభావం

- మద్దతు ప్రకటించిన కెవిపిఎస్, బిఎస్‌పి
- మూడోరోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-బల్లికురవ

భూముల కోసం గొర్రెపాడు, కూకట్లపల్లి దళిత పేదలు సాగిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని కేవీపీఎస్, బిఎస్పీ నాయకులు సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు కూడా కొనసాగాయి. ఈ దీక్షలకు సంఘీభావం ప్రకటించిన బహుజన సమాజ్‌వాది పార్టీ నాయకులు మంద జోసెఫ్ మాట్లాడుతూ దళితుల భూముల సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దళితులు చేసే ఈ భూ పోరాటానికి తమ పార్టీ తరపున మద్దతు తెలియజేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో అవసరం అయితే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు బడుగు రూపేష్ మాట్లాడుతూ 799 చట్ట ప్రకారం దళితుల భూములు దళితులకే దక్కాలని, ఈ మండలంలో పనిచేస్తున్న అధికారులు గతంలో పనిచేసిన అధికారులు వాళ్ల ఇష్టం వచ్చినట్టు రికార్డులు తారుమారు చేసి దళితులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ అధికారులు అవలంబిస్తున్న విధానాన్ని కెవిపిఎస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించి దీక్ష విరమించే విధంగా చర్యలు జరపాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు దీక్షలను పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూ సాధన కమిటీ కన్వీనర్ ముట్లూరు లాబాను, కమిటీ సభ్యులు వేల్పుల ఏవో, తంగిరాల దానమ్మ, తంగిరాల సామేలు, వేల్పుల బాలరాజు, తానుపర్తి నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న దళితులు

సిఐటియు జెండా కార్మికులకు అండ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

సిఐటియు జెండా కార్మికులకు అండ అని నాయకులు అన్నారు. సోమవారం సిఐటియు అఖిల భారత 17వ మహాసభల సందర్భంగా సిఐటియు పతాకాన్ని బాపట్ల పట్టణం పాత బస్టాండ్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ సిఐటియు 17 అఖిల భారత మహాసభలు జనవరి 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా సిఐటియు జెండాలు అన్ని ప్రాంతాల్లో ఆవిష్కరణ జరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభలు జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌గా మార్చిందని అన్నారు. పనిగంటల పెంపును ప్రతిపాదిస్తుందని, లక్షలాదిగా ఉన్న స్కీం వర్కర్లని కార్మికులుగా గుర్తించడానికి సిద్ధంగా లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 1ని వ్యతిరేకిస్తూ జీవో ప్రతుల్ని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణిచివేస్తోందని అన్నారు. జీవో నెంబర్ ఒకటిని ప్రజానీకం వ్యతిరేకించాలని, రాష్ట్ర ప్రభుత్వ వెంటనే జీవో నెంబర్ ఒకటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బి తిరుమలరెడ్డి ఎన్ కోటేశ్వరరావు భాస్కరరావు, పి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మజుందార్, చిత్రంలో సిహెచ్ గంగయ్య

మహిళల అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం: ఎంపీడీవో

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిహెచ్ ధనలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంపిడిఓ ఎలిషాబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా మన రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. నవరత్నాలతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేవి కొనుగోలు శక్తి పెంచుతున్నామన్నారు. చట్టం కోసం ప్రతి మహిళా పారిశ్రామిక, ఉత్పత్తి రంగాలు మరియు వ్యాపార, సేవా కార్యక్రమాలతోపాటు రాజకీయ రంగాలలో ముందుండాలని అన్నారు. ఎపిఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహిళలు ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సెక్రెటరీ నాగలక్ష్మి, ట్రెజరర్ షేక్ నసీమా, ఐసిడిఎస్ సూపర్ వైజర్ మల్లేశ్వరి, ఆరోగ్యశాఖ సిహెచ్ఓ మీరమ్మ, ఎతఈ భాగ్యలక్ష్మి, సిసిలు శౌరి పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరరావు, లక్ష్మి, సోమేశ్వరి, అకౌంటెంట్ లక్ష్మి, గ్రామ సంఘాలవారు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎలిషాబాబు

పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సదస్సు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక బూచేపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ రీప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దశరథరామిరెడ్డి, సిఈఓ కోటిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ కుల జనగణన జరిపించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వం జనవరి 7 నుంచి బీసీ జన గణన ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గతంలో ఏపీ ప్రభుత్వం బిసి కుల జనగణన జరిపించవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ బాపట్ల అధ్యక్షులు గొర్ల శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ జనగణన జరిపించటానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. అధ్యక్షులు గొర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 90 సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారి కాలంలో 1931లో జరిగిన బీసీ జనగణన ఆధారంగా ఓబీసీ రిజర్వేషన్లు అమలు, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రాతిపదికగా ఉపయోగించటం చాలా శోచనీయం అని అన్నారు. బీహార్ ప్రభుత్వం లాగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీ జనగణన జరిపించి బీసీ సంక్షేమానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనుముల భాస్కర్ గౌడ్, లంబు సాంబయ్య యాదవ్, మూర్త చిన్న వెంకటేశ్వరావు, మారం రవికుమార్, మారం భాను భాస్కర్, కొండా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు గురుకులం సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పర్చూరు గిరిజన బాలల గురుకులం సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. గత నెల 20వ తేదీన పర్చూరు బాలల గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులు మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నారనే వీడియో రాష్ట్రం మొత్తం వైరల్ అయిన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ బృందం పాఠశాలను సందర్శించి అనేక వివరాలను సేకరించారు. పూర్తి సమాచారాన్ని వినతిపత్రం రూపంలో డిసెంబర్ 26వ తేదీన స్పందనలో బాపట్ల కలెక్టర్‌కు అందించారు. ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో సోమవారం ఇదే అంశంపై మరొకసారి కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ పర్చూరు గురుకుల పాఠశాలలో జరుగుతున్న విషయాల పట్ల జిల్లా స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని స్పందనలో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడం, విచారణ పేరుతో కాలక్షేపం చేయడం సరికాదని అన్నారు. ఆధారాలు కళ్ళ ముందు కనిపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం సరికాదని అన్నారు. ఫలితంగా పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు లేకపోవడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ఉపాధ్యాయుల మధ్య ఉన్న వ్యక్తిగత కక్షల కారణంగా విద్యార్థుల పట్ల, పాఠశాల పట్ల పెద్ద ఎత్తున అబద్ధ ప్రచారాలు జరుగుతున్నాయని, దీనిని పరిష్కరించాల్సిన ప్రిన్సిపల్ తనకేం పట్టనట్టు బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని తప్పుబట్టారు. గత నెలలో హాస్టల్‌లో వంట చేసే వ్యక్తికి పిఇటీ చంద్రబాబు నాయక్‌కి మధ్య గొడవల కారణంగా ఈ వీడియో బయటకు వచ్చిన నేపథ్యంలో ఆదేవిధంగా చంద్రబాబు నాయక్ హాస్టల్ విద్యార్థులపై అసభ్యకరంగా సెక్సువల్ హరాస్మెంట్ చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదేవిధంగా ప్రిన్సిపల్ కావాలనే తనకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకి ఇష్టం వచ్చినట్టుగా సెలవులు ఇవ్వడంతో పదో తరగతి విద్యార్థులకు ఇంతవరకు కనీసం పాఠాలు కూడా చెప్పలేదని, దీంతో అరకొర చదువులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సెలవులపై ఉన్న ఉపాధ్యాయులను పాఠశాలలకు రప్పించాలని, సక్రమంగా తరగతులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం: డిఎస్‌పి

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రముఖ హాస్పిటల్ అను మై బేబీ హాస్పిటల్స్ విజయవాడ వారిచే నిర్వహించబడిన తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె డిఎస్పి టి మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం రేపల్లె ప్రభుత్వ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిఎస్పి ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచి ఆధ్వర్యంలో అనుమై బేబీ హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శిబిరంలో తల్లీ బిడ్డలకు వైద్య పరీక్షలు జరిపి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రేపల్లె సత్య సాయి సేవా సమితి వారు ఈ శిబిరంలో పాల్గొన్న మహిళలందరికీ పండ్లు, రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వసంతం వీరరాఘవయ్య రేపల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు మరియు సిబ్బంది, అను మై బేబీ హెల్త్ హాస్పిటల్స్‌కు చెందిన పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ బాపా, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మణి, మార్కెటింగ్ మేనేజర్ కె అనిల్ కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సయ్యద్ కరీముల్లా పాల్గొన్నారు.

ఆమంచిని కలిసిన 'తోకల'

ప్రజాశక్తి-పర్చూరు

వైసీపీ సీనియర్ నాయకులు, దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని దేవరపల్లి నుంచి 80 మంది కార్యకర్తలు ఆమంచి కృష్ణమోహన్‌ను కలిశారు. పందిళ్లపల్లిలోని ఆమంచి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ పలతోటి లాజరు, గ్రామనాయకులు, అభిమానులు ఆమంచిని గజమాలతో సత్కరించారు.

అడ్డరోడ్డు జంక్షన్‌లో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-సంతమాగులూరు

పుట్టవారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పెట్రోల్ మరియు డీజిల్ రేట్లు పెరగడాన్ని ఖండిస్తూ, మండల టిడిపి నాయకులు మండలంలోని పుట్ట వారి పాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఉన్న స్థానిక పెట్రోల్ బంకు వద్ద తమ నిరసనను తెలియజేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబుల కొండలు, కొనికి శ్రీను, సింబోతుల వీరయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఇంకొల్లు మండలం దుద్దుకూరులో రాయిని సుబ్బరామయ్య సహకారంతో నిర్వహించారు. శిబిరంలో 350 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగ నిర్ధారణ జరిగిన పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ క్యాంపులో డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ కంభంపాటి లత,రాణి, కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్పం ఉంటే విజయం

ప్రజాశక్తి-పిట్లలవాని పాలెం: సంకల్పం ఉంటే ఎంతటి పనిలోనైన విజయం సాధించవచ్చు అని అలకాపురం సర్పంచ్ గంగరాజు అన్నారు. మండలంలోని అలకాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న, దుండి కిరణ్ కుమార్‌రెడ్డి, నాగలక్ష్మి కుమారుడైన దుండి రెష్మంత్ రెడ్డి అనే విద్యార్థి ఒంగోలులో డిసెంబర్ 24, 25వ తేదీలలో జరిగిన తైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, ఎంఇఓ వుయ్యూరి వెంకటేశ్వరరావు, కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ మండే విజయకుమార్, తైక్వాండో కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు విద్యార్థిని అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సమ్మెట నాగబాబు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీకి సమస్య వివరిస్తున్న అర్జీదారులు

ఫిర్యాదుదారుల పట్ల సహృదయభావంతో వ్యవహరించాలి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఫిర్యాదుదారుల పట్ల సహృదయభావంతో వ్యవహరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రజల సమస్యల సత్వర పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి పిటీషనర్‌తో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, వారి పిటీషన్లకు చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయాలకు వస్తుంటారని, వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి సహృదయ భావంతో వారి సమస్యలను విని సమస్య పరిష్కారం చేస్తామనే భరోసా వారికి కల్పించాలన్నారు. చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువు లోపు ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి 33 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

గంజాయి సాగుపై ఉక్కుపాదం: ఏఎస్పీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపుతా మని జిల్లా ఏఎస్పీ కె.నాగే శ్వరరావు అన్నారు. సోమ వారం ఆయన యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ ఆదేశాలతో పెద్దదోర్నాల మండలంలోని బొమ్మలా పురం, యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గ్రామాలలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. గంజాయి సాగుదారులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కార్యక్రమంలో సిఐ కె మారుతీకృష్ణ, ఎస్ఐ కోటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.209 కోట్లతో బడ్జెట్ అంచనాలు

- ఓఎంసి కౌన్సిల్ ఆమోదం
- పిపిపిలో నిర్మాణాలు జరుపుకునేందుకు పాత మార్కెట్, పంజాబ్‌నేషన్ బ్యాంకు స్థలం కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్
- కౌన్సిల్ హాలు నిర్మాణానికి ఎంపీ నిధులిస్తామన్న మాగుంట

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత, మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఒంగోలు నగరపాలక సంస్థ బడ్జెట్ అంచనాలు రూ.209.23 కోట్లకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్‌లో చిన్నచిన్న సవరణలు చేస్తూ భారీ బడ్జెట్‌కు ఆమోదం లభించింది. ఖర్చు రూ.196.89 కోట్లు, మిగులు నిల్వ రూ.12.34 కోట్లుగా ప్రతిపాదించారు. బడ్జెట్ అంతా తప్పుడు తడకలుగా, వాస్తవాలకు దూరంగా ఉందని టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య ఆరోపించారు. రాని ఆదాయాలు, నిధులు వచ్చేట్లు, ఖర్చు చేయని నిధులు ఖర్చు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదంపై జరిగిన చర్చలో అధికార పార్టీకి చెందిన మెజారిటీ సభ్యులు పాల్గొనకుండా డుమ్మా కొట్టారు. కార్పొరేషన్ సాధారణ, అత్యవసర, ప్రత్యేక సమావేశాలు వేర్వేరుగా సోమవారం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగాయి. సాధారణ, అత్యవసర సమావేశాలకు సంబంధించిన అజెండాలలో అంశాలను మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు చర్చిం చారు. బడ్జెట్ మీద జరిగిన ప్రత్యేక సమావేశం మధ్యాహ్నం మూడు గంటల తరువాత బోజన విరామం అనంతరం నిర్వహించారు. ఈసమావేశంలో ప్రతిపక్ష కార్పొరేటర్లు మొత్తం హాజరుకాగా అధికార పార్టీకి చెందిన మెజారిటీ సభ్యులు గైర్హాజరయ్యారు. అప్పటివరకు సాధారణ, అత్యవసర సమావేశాలలో పాల్గొన్న అధికారపార్టీ మెజారిటీ సభ్యులు ప్రత్యేక సమావేశంలో పాల్గొనకుండా ఇళ్ల బాట పట్టడంతో సమావేశం మందిరంలోని కార్పొరేటర్ల స్థానాలు ఖాళీగా కనిపించాయి. అయితే సభ్యులంతా సమావేశ రిజిస్టర్‌లో సంతకాలు చేయడంతో అందుబాటులో ఉన్న సభ్యులతో చర్చించి బడ్జెట్ ఆమోదం పొందినట్లు మేయర్ ప్రకటించారు.

పిపిపిలో రెండు చోట్ల కట్టడాలకు గ్రీన్‌సిగ్నల్..

పబ్లిక్ ప్రయివేటు పార్టనర్ షిప్ (పిపిపి)లో పాత మార్కెట్ స్థలంలో ఆర్గనైజ్‌మాల్, పంజాబ్ నేషనల్ బ్యాంకు స్థలంలో బిగ్ బాక్స్ రిటైల్ లేదా మిక్స్‌డ్ యూజ్ రిటైల్ నిర్మాణాలు చేసుకొని 25 సంవత్సరాలు పాటు నిర్వహించుకునేందుకు రిక్వస్టఫర్ ప్రపోజల్స్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఆయా ప్రాంతాల్లో గ్లోబల్ టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపట్టాలని, స్థలాలు కార్పొరేషన్ ఆధీనంలోనే ఉండేలా చూడాలని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య కోరారు. అధికార పార్టీ కార్పొరేటర్లు మాత్రం పిపిపిలో స్థలాలు ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. నెల్లూరు బస్టాండ్‌లోని కార్పొరేషన్ స్థలంలో ఐడిఎస్ఎంటి స్కీంలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన కట్టడాలను తిరిగి కార్పొరేషన్ నిధులతో పూర్తి చేయాలా..? లేక పిపిపిలో కేటాయించాలా.? అనే విషయాన్ని వాయిదా వేశారు. ఐడిఎస్ఎంటి నిధులతో చేపట్టిన నిర్మాణాలను కార్పొరేషన్ నిధుల ద్వారానే పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు సూచించారు. టిడిపి కార్పొరేటర్ రమణయ్య కూడా కార్పొరేషన్ నిధులతోనే నిర్మాణాలు చేయాలని చెప్పారు. పిపిపిలోనే కట్టడాలు చేసేందుకు అనుమతించాలని కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. ఈ విషయంపై భిన్నభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.

సమస్యలను ప్రస్తావించిన కార్పొరేటర్లు..

తమ డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంతో కాలం నుంచి అడుగుతున్నా పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. శివారు కాలనీలలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కార్పొరేటర్ నర్సయ్య కోరారు. తన డివిజన్‌లో అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కట్టడాల మీద లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలు జరిగేటప్పుడు అడ్డుకోకుండా అధికారులు బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎన్ఎస్‌పి కెనాల్ కట్టమీద బిటి రోడ్డు వర్కు నిర్మాణం చేయాలనే ప్రతిపాదనలు సరైనవి కాదని, అక్కడ సిమెంటు రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. పట్టణ ప్రణాళికా విభాగంలో టిపిఒ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఓ పని విషయంలో 38 సార్లు ఫోన్ చేసినా స్పందించలేదని కార్పొరేటర్ తాడి కృష్ణలత ఆరోపించారు. ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద రోడ్డు ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ నర్సయ్య తెలిపారు. అమృత్ పథకం అప్పుల పథకంగా తయారైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాల కంటే కార్పొరేషన్ వాటా నిధులే ఎక్కువగా కేటాయించాల్సి వస్తోందని కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్ బాబు వ్యాఖ్యానించారు. అమృత్ పథకం దేశమంతా ఉందని, ఒంగోలు కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా లేదని టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య పేర్కొన్నారు. అమృత్ పథకంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి ఒంగోలు వరకు చేపట్టిన పైప్‌లైన్ పనులు అస్సలు జరుగుతున్నాయో..? లేదో..! అర్థం కావడం లేదని, చేసిన అప్పులకు కార్పొరేషన్ మాత్రం ప్రతినెలా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు ప్రస్తావించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (ఒడా) నిధులతో మామిడిపాలెం ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మీద వాకర్స్ ట్రాక్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలిపారు. సభ్యులు ప్రస్తావించిన పలు విషయాలకు కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మాల్యాద్రి, ఎసిపి కె వెంకటేశ్వర్లు, ఆర్ఓ మధుసూదన్‌రావు సమాధానాలు తెలిపారు.

కౌన్సిల్ హాలు నిరాణానికి నిధులిస్తా..

కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో కౌన్సిల్ హాలు, డిప్యూటి మేయర్‌ల ఛాంబర్‌లు, కార్పొరేటర్‌ల గదులు ఒకే చోట నిర్మించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తే నిర్మాణానికి తన ఎంపీ నిధులు సమకూరుస్తానని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఎక్స్‌అఫిషియో సభ్యుని హెూదాలో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో సోమవారం ఆయన తొలిసారిగా పాల్గొన్నారు. కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో నాలుగు అంతస్తుల్లో నూతన భవన నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి, ప్రభుత్వ ఆమోదం పొందిన ప్రాంతాన్ని పరిశీలించారు. నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

సహేతుకంగా స్పందన అర్జీల పరిష్కారం

- డయల్ యువర్, స్పందనకు విశేష స్పందన
- కలెక్టర్ దినేష్ కుమార్

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన అర్జీలను త్వరగా, సహేతుకంగా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన "స్పందన", "డయల్ యువర్ కలెక్టర్" కార్యక్రమాలలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని పునరుద్ఘాటించారు. ఈ విషయంలో పర్యవేక్షణ కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఈ కమిటీ గుర్తించినట్లయితే ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

- దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం నుంచి పి. లక్ష్మా నాయక్ ఫోన్ చేసి గ్రామపంచాయతీ మోటారు పనిచేయక పోయినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే మోటార్‌ను బాగు చేయించాలని అధికారులను ఆదేశించారు.
- గొట్టిపడియ గ్రామం నుంచి రాజు ఫోన్ చేసి ముంపు గ్రామవాసినైన తన పేరు సర్టిఫికెట్లలో ఒకలా, గెజిట్ లో ఒకలా ఉందని, తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బి. చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వందనం, గ్లోరియా, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పొత్తూరి పేరయ్య

అశ్రునివాళి

నాటి, నేటి తరాలకు స్ఫూర్తి ప్రదాత..
సోషలిస్ట్ సమాజ నిర్మాణానికి పరితపించిన
నిబద్ధత గల కమ్యూనిస్ట్..
కులతత్వానికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం..
రైతు కూలీలల అభివృద్ధిని ఆకాంక్షించి
మమ్ములను నీ బాటలో నడిపించిన మార్గదర్శికి
అశ్రునయనాలతో...

కుమారుడు - కోడలు
పొత్తూరి నారాయణ - ప్రేమ పావని

కుమార్తెలు - అల్లుళ్లు
ముప్పరాజు అన్నపూర్ణ - ఎం.సి. వెంకటేశ్వర్లు
వడ్డి సరోజినీ దేవి - ప్రభాకర రావు

మనుమలు
ముప్పరాజు అజయ్ కుమార్ - క్రాంతిరేఖ
వడ్డి గోపీ కృష్ణ - శరత్ చంద్రిక
పొత్తూరి పూర్ణ చంద్ర జోషి - నిరీక్షణ
వడ్డి మురళి కృష్ణ - నవ్య

మనుమరాలు
మద్దినేని విజయ - శ్రీనివాసరావు

సంస్మరణ సభ :
తేది: 10-01-2023 ఉదయం 10 గంటలకు
పొత్తూరి సుబ్బమ్మ - పేరయ్య కమ్యూనిటీ హాల్,
మారెళ్లగుంటపాలెం నందు జరుగును